
సాక్షి ఒడిశా

సోమవారం । 23 । జూన్ । 2025



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు
నగదు : రూ. 2,43,131
– భువనేశ్వర్/పూరీ



తెగిన హిరాఖండ్ బోగీలు

హిరాఖండ్ బోగీలు తెగిపోయాయి. ఎలాంటి ప్రమాదం జరగలేదు.

- 8లో



శాపంలా మారిన ఆయుష్మాన్

దాత కుటుంబం నేడు దీనావస్థకు చేరుకుంది. ఆఖరకు ఆయుష్మాన్ కార్డు కూడా వెక్కిరిస్తోంది.

- 8లో

న్యూస్‌రీల్

అలరనాథుని దర్శించుకున్న ముఖ్యమంత్రి



అలరనాథుని సన్నిధిలో ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి

భువనేశ్వర్: రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ ఆదివారం బ్రహ్మగిరిలోని అలర్‌నాథ్ స్వామిని దర్శించుకున్నారు. స్వామి ఆశీస్సులు సంపన్నమైన ఒడిశా లక్ష్యాన్ని సాధించడానికి బలాన్ని ఇస్తాయన్నారు. ముఖ్యమంత్రి అయిన తర్వాత ఆయన ఈ ఆలయాన్ని సందర్శించడం ఇదే తొలిసారి.

జంఝావతి వంతెనపై రెండు వాహనాలు ఢీ



బ్రిడ్జి మలుపు వద్ద మంటల్లో చిక్కుకున్న రెండు వాహనాలు



గాయపడిన రమేష్ పలక

రాయగడ: స్థానిక మజ్జిగౌరి మందిరం సమీపంలో గల జంఝావతి నది వంతెన మలుపు వద్ద ఆదివారం రెండు వాహనాలు ఢీకొన్నా యి. ఆంధ్రప్రదేశ్ నుంచి బొగ్గు లోడుతో చత్తీస్‌గఢ్ వైపు వెళ్తున్న టిప్పర్, వత్తాడ నుంచి రాయగడకు మరమ్మతు కోసం వెళ్తున్న పికప్ వ్యాన్‌లు వంతెన మలుపు వద్ద ఢీకొనడంతో డీజిల్ ట్యాంక్ లీకై ఒక్కసారిగా మంటలు చెలరేగి రెండు వాహనాలు మంటల్లో చిక్కుకున్నాయి. ప్రమాదం చోటు చేసుకున్న వెంటనే పికప్ వ్యాన్, టిప్పర్ డ్రైవర్లు వాహనాల నుంచి గెంతేసి ప్రాణాలు కాపాడుకోగలిగారు. అయితే టిప్పర్‌లో హెల్పర్‌గా పనిచేస్తున్న వత్తాడ గ్రామానికి చెందిన పలక రమేష్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. రెండు వాహనాలు ఒకేసారి వెళ్తున్న సమయంలో మలుపు వద్ద టిప్పర్ అత్యంత వేగంగా నడపడంతో వెనుక నున్న వ్యాన్‌ను ఢీకొట్టింది. దీంతో రెండు వాహనాలు మలుపు వద్ద ఇరుక్కుపోయాయి. అనంతరం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అయితే కొంత సమయం రాయగడ మీదుగా ఆంధ్రవైపునకు వెళ్లేందుకు రాకపోకలు నిలిచిపోయాయి. పోలీసులు చొరవ తీసుకుని వాహనాలను పక్కకు నెట్టించి రాకపోకలను పునరుద్ధరించారు.

నవీన్ శస్త్ర చికిత్స విజయవంతం



బ్రహ్మగిరి అలార నాథ స్వామి దేవస్థానం ఆవరణలో బిజు జనతా దళ్ కార్యకర్తల సామూహిక దీపారాధన

భువనేశ్వర్: రాష్ట్ర విపక్ష నేత, బిజూ జనతా దళ్ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్ ఆరోగ్యం కోలుకుంటుంది. ముంబైలో ఆదివారం నిర్వహించిన శస్త్ర చికిత్స విజయవంతమైందని ఆయన వ్యక్తిగత వైద్యుడు డాక్టర్ రమాకాంత పండా తెలిపారు. అందరితో సహజంగా మాటామంతీ చేస్తున్నారు. వైద్యపరమైన పరిశీలన కోసం ఆస్పత్రిలో ఉన్నారు. 5, 6 రోజుల్లో ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అవుతారన్నారు. ప్రియతమ నాయకుడు త్వరగా ఆరోగ్యంతో కోలుకోవాలని బీజేడీ కార్యకర్తలు రాష్ట్ర వ్యాప్తంగా సామూహిక దీపారాధన కార్యక్రమం చేపట్టారు. దీనిలో భాగంగా పూరీ జిల్లా బ్రహ్మగిరి నియోజక వర్గం మాజీ ఎమ్మెల్యే సంజయ్ కుమార్ దాస్‌బర్మ ఆధ్వర్యంలో స్థానిక అలరనాథ స్వామి దేవస్థానం ఆవరణలో సామూహిక దీపారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో నవీన్ పట్నాయక్ అభిమానులు, అనుచరులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రథయాత్ర నిర్వహణ పవిత్ర బాధ్యత: సీఎం

- రథయాత్ర తుది సన్నద్ధత సమీక్ష సమావేశం



ముఖ్యమంత్రికి సేవాయత్ సత్కారం



రథయాత్ర తుది సన్నద్ధత సమీక్ష సమావేశానికి హాజరైన ముఖ్యమంత్రితో పలువురు మంత్రులు, శ్రీ మందిరం సీఏఓ తదితర ప్రముఖులు

భువనేశ్వర్: శ్రీ జగన్నాథుడు స్వస్థతతో క్రమంగా యథా స్థితికి చేరుకుని దైనందిన సేవలు అందుకునేందుకు సిద్ధం అవుతున్నాడు. మరి కొద్ది రోజుల్లో స్వామి పూర్తిగా కోలుకుని యాత్రకు బయల్దేరుతాడు. ఈ నేపథ్యంలో ఆదివారం రథయాత్రకు సంబంధించిన తుది సన్నాహక సమీక్ష సమావేశం పూరీ మున్సిపాలిటీ టౌన్ హాల్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ అధ్యక్షతన జరిగింది. ఆయనతో ఇద్దరు ఉప ముఖ్యమంత్రులు ప్రభాతి పరిడా, కనక వర్ధన్ సింగ్‌దేవ్, న్యాయ, పట్టణాభివృద్ధి, ఆరోగ్యం, సంస్కృతి శాఖల మంత్రులు, పూరీ జిల్లా పార్లమెంటు సభ్యులు, శాసన సభ సభ్యులు, పోలీసు, ఆరోగ్యం, అగ్నిమాపక మరియు పౌర శాఖల ఉన్నత అధికారులు సమావేశానికి హాజరయ్యారు.

ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి మాట్లాడుతు రథయాత్రను సజావుగా నిర్వహించడం ప్రభుత్వ విధి మాత్రమే కాదు, పవిత్రమైన బాధ్యత అని పేర్కొన్నారు. స్వామి యాత్ర ఒడిశా సాంస్కృతిక వారసత్వానికి ఘనమైన ప్రతీకగా ఆయన అభివర్ణించారు. లక్షలాది మంది ప్రజల భావోద్వేగాలు జగన్నాథ రథయాత్రతో ముడిపడి ఉన్నాయన్నారు. అన్ని విభాగాల అధికారులు, ఉద్యోగులు, ప్రైవేట్ సంస్థలు పూర్తి సమన్వయంతో పని చేసి దైవికమైన ప్రపంచ ప్రఖ్యాత ఉత్సవాన్ని విజయవంతంగా నిర్వహించడానికి దోహదపడాలని ఆయన పిలుపునిచ్చారు.

యాత్ర సంబంధిత పూజాదుల్ని నిర్ధారిత వేళల్లో సకాలంలో పూర్తి చేయడంలో సేవాయత్ వర్గాలు సహృదయంతో సహకరించాలన్నారు. ఈ వర్గం ఆచారాల పవిత్రత, క్రమశిక్షణ యాత్రలో అత్యంత ప్రధానమన్నారు. రథాలు లాగే సందర్భంగా పటిష్టమైన క్రమబద్ధీకరణ, క్రమశిక్షణతో జన సందోహంపై నిఘా వేసి అవాంఛనీయ సంఘటనలను నివారించడం యాత్ర తొలి విజయంగా నిలుస్తుందని తెలిపారు. యాత్రలో భక్తులకు సదవకాశం కల్పించే దిశలో తొక్కిసలాట వంటి విపత్కర పరిస్థితులు తలెత్తకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. ఇటీవల కొన్ని జిల్లాల్లో అతిసార ప్రబలిన విషయం తెలిసిందే. యాత్ర సమయంలో ఈ పరిస్థితి పట్ల అనుబంధ యంత్రాంగంతో అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఆరోగ్య శాఖ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలుషిత ఆహారం, అసురక్షిత తాగునీటి అమ్మకాలను నిరోధించాలన్నారు. అన్ని కీలక ప్రదేశాలలో స్వచ్ఛమైన తాగునీరు, చక్కని పర్యావరణం మధ్య పరిశుభ్రమైన ఆహారం లభ్యతను నిరంతరం అందుబాటులో ఉంచాలన్నారు.

ఈ ఏడాది జరగనున్న రథ యాత్ర భద్రతా ప్రణాళికను రాష్ట్ర పోలీస్ డైరెక్టర్ జనరల్ యోగేష్ బహదూర్ ఖురానియా ఆవిష్కరించారు. యాత్ర సందర్భంగా సమగ్ర పూరీ పట్టణం 5 అంచెల భద్రతా వలయంలో ఉంటుందన్నారు. 10,000 మందికి పైగా భద్రతా సిబ్బంది ఈ కార్యకలాపాల్లో పాలుపంచుకుంటారు. యాత్ర పర్యవేక్షణ కోసం 275 కృత్రిమ మేధస్సు (ఏఐ) కెమెరాలు, ట్రాఫిక్ మరియు జన సమూహ నియంత్రణ కోసం డ్రోన్ నిఘా, తాజా ట్రాఫిక్ నవీకరణలు మరియు రూట్ మ్యాప్‌ల కోసం చాట్‌బాట్ యాప్, తక్షణ ప్రతిస్పందన బృందాలు, ఉగ్రవాద వ్యతిరేక బృందాలు, మెరైన్ పోలీసులు, నేవీ కోస్ట్ గార్డ్ ఉమ్మడి గస్తీ కార్యకలాపాల్లో పాల్గొంటారు. వాహనాల రాకపోకలకు అనుకూలంగా యాత్ర పరిసరాల్లో 26 చోట్ల ప్రత్యేక పార్కింగ్ జోన్‌లను గుర్తించారు. అంబులెన్స్‌లకు నిరంతరాయ రవాణా కోసం గ్రీన్ కారిడార్ నిర్ధారించారు.

రథ యాత్రకు 365 ప్రత్యేక రైళ్లు

శ్రీ జగన్నాథుని రథం యాత్ర కోసం తూర్పు కోస్తా రైల్వే 365 ప్రత్యేక రైళ్లు నడుపుతుంది. రాష్ట్రంలో దాదాపు అన్ని ప్రాంతాలు, ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం, పలాస, జగదల్‌పూర్ గోండియా (ఛత్తీస్‌గఢ్), పశ్చిమ బెంగాల్‌లోని సంత్రాగచ్చి (కోల్‌కతా) ప్రాంతాల అనుసంధానంతో ఈ ప్రత్యేక రైళ్లు నడుస్తాయని ప్రకటించారు.



రథయాత్ర తుది సన్నద్ధత సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి ప్రసంగం



రథయాత్ర తుది సన్నద్ధత సమీక్ష సమావేశానికి హాజరైన వివిధ శాఖల ఉన్నతాధికారులు, సేవాయత్ వర్గాల ప్రతినిధులు

'పేపర్ మిల్లు ఉద్యోగుల వేతనాలు చెల్లించాలి'



కొరాపుట్ కలెక్టరేట్ వద్ద పేపర్ మిల్ కార్మిక సంఘాల ప్రతినిధులు



కొరాపుట్ కలెక్టర్ వి.కీర్తి వాసన్‌కి పేపర్ మిల్ సమస్యలు వివరిస్తున్న రబినందో

కొరాపుట్: జయపూర్‌లోని ఏఈఆర్‌పిఎల్ యూనిట్ సేవా పేపర్ మిల్ ఉద్యోగుల వేతనాలు చెల్లించాలని మాజీ మంత్రి రబి నారాయణ విజ్ఞప్తి చేశారు. ఆదివారం కొరాపుట్ జిల్లా కేంద్రంలోని కలెక్టర్ వి.కీర్తి వాసన్‌తో పేపర్ మిల్ ఉద్యోగుల సంఘాల ప్రతినిధులు సమావేశమయ్యారు. సమావేశంలో రబినందో పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఇంతవరకు నాలుగు సార్లు పేపర్ మిల్‌ని క్రయ విక్రయాలు జరిపారన్నారు. మిల్‌లో ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేస్తామని చెప్పిన యాజమాన్యాలు ప్రభుత్వం నుంచి రుణాలు పొంది కార్మికుల కష్టాలు పట్టించుకోలేదన్నారు. ఈ విడత పేపర్‌మిల్‌ని కొనుగోలు చేసిన ఏ సంస్థ అయినా ముందుగా కార్మికుల వేతనాలు చెల్లించాని విజ్ఞప్తి చేశారు. గత ఏడాది ఆగస్టు నుంచి వేతనాలు ఇవ్వడం లేదని, అంతకు ముందు మూడు విడతలుగా వేతనాలు బాకీ ఉన్నారని, 2016 నుంచి బోనస్ పక్కన పెట్టారని, అనేక బాకీలు ఉన్నారని గుర్తు చేశారు. ఇప్పటి వరకు వేతనాలు అందని 41 మంది కార్మికులు చనిపోయిన విషాదకర పరిస్థితి ఉందని కలెక్టర్‌కి వివరించారు. మరికొన్ని రోజులు ఆగితే మిల్లులో కార్మికుల ఆకలి కేకలు మరింతగా వినిపిస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో బిల్ట్ సేవా పేపర్ మిల్ ఎంప్లాయిస్ యునియన్, బాలార్‌పూర్ ఇండస్ట్రీస్ ఎంప్లాయీస్ యూనియన్ కార్మికులు, సీనియర్ ఉద్యమ నాయకులు ప్రమోద్ మహంతి తదితరులు పాల్గొన్నారు.

వెండి వ్యాపారి ఇంట్లో చోరీ

పర్లాకిమిడి: స్థానిక 8వ వార్డు ఆరోగ్యవీధిలో శనివారం అర్ధరాత్రి వెండి వ్యాపారి సూర్యవంశీ ఉత్తమ్‌రావు ఇంట్లో చోరీ జరిగి 10కిలోల వెండి వస్తువులు, 3 తులాల బంగారం పోయినట్టు పొరుగున ఉన్న గోడి సూర్యకుమార్ ఆదివారం ఉదయం ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ జయకృష్ణ పాణిగ్రాహి చెప్పిన వివరాలు ప్రకారం.. జూన్ 22 శనివారం అర్ధరాత్రి 12.30 నుంచి 2.30ల మధ్య ఆరోగ్యవీధిలో ఒక ఇంటిలో ఈ దొంగతనం జరిగినట్టు ఫిర్యాదు దారుడు గోడి సూర్యకుమార్ పేర్కొన్నాడు. గత పదిరోజులుగా ఇంటి యజమాని మార్వాడీ సూర్యవంశీ ఇంటిలో లేరు. మహారాష్ట్ర వెళ్లారు. అయితే గత రాత్రి ఇంట్లో ఉన్న సి.సి.టీవీ ఫుటేజీని పరిశీలించిన మార్వాడీ ఉత్తమ్ రావు పర్లాకిమిడిలో పొరుగున ఉన్న గోడి సూర్యకుమార్‌కు ఫోన్ చేసి దొంగతనం విషయం తెలియజేశాడు. దీంతో ఉదయం స్థానిక ఆదర్శ పోలీసుస్టేషన్‌లో ఆయన ఫిర్యాదు చేశారు. పోలీసులు ఆదివారం ఉదయం దర్యాప్తు చేశారు.

ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో వనయజ్ఞం



జయపూర్‌లో వన యజ్ఞంలో ఆర్య వైశ్య సంఘం ప్రతినిధులు

కొరాపుట్: ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో వన యజ్ఞం జరిగింది. ఆదివారం జయపూర్ పట్టణంలోని కొత్త తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో సామూహికంగా మొక్కలు నాటారు. ప్రతి ఏడాది ఆర్య వైశ్య సంఘం ఈ కార్యక్రమం నిర్వహిస్తుంది. ఈ కార్యక్రమం లో సుమారు వంద మెక్కలను కార్యాలయ పరిసర ప్రాంతాలలో నాటారు. కార్యక్రమంలో రిటైర్డ్ వ్యవసాయాధికారి గంటా వెంకట రెడ్డి, రిటైర్డ్ ఏబీఐ జోనల్ మేనేజర్ జి.వి.రావు, పొట్టా సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



మెక్కలు నాటుతున్న వెంకట రెడ్డి తదితరులు

గుండిచా ఆలయ పనులపై సమీక్ష




గుండిచా ఆలయ సందర్శనలో సీఎంతో పాటు మంత్రులు

భువనేశ్వర్: నవ దినాత్మక యాత్రకు విచ్చేయనున్న శ్రీ జగన్నాథుని రాక కోసం గుండిచా ఆలయం నిరీక్షిస్తోంది. ఏటా రథ యాత్ర పురస్కరించుకుని స్వామి సోదర సోదరీ సమేతంగా ఈ ఆలయంలో అడపా మండపంపై కొలువు దీరుతాడు. ఈ సందర్భంగా ఆలయం పునరుద్ధరణ పనులు యుద్ధ ప్రాతిపదికన నిర్వహిస్తున్నారు. ఈ పనుల్ని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ప్రత్యక్షంగా గుండిచా ఆలయాన్ని సందర్శించి సమీక్షించారు. రథ యాత్ర తుది సన్నద్ధత సమావేశం తర్వాత ముఖ్యమంత్రి ఈ మందిరం సందర్శించారు. ఆయనతో ఇరువురు ఉప ముఖ్యమంత్రులు ప్రభాతి పరిడా, కనక వర్ధన్ సింగ్‌దేవ్, ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి మనోజ్ ఆహుజా, రాష్ట్ర పోలీసు డైరెక్టరు జనరల్ యోగేష్ బహదూర్ ఖురానియా సందర్శించారు.

పర్లాకిమిడి గజపతి ప్యాలెస్‌కు జాతీయ స్మారక చిహ్నంగా గుర్తింపు



పర్లాకిమిడిలో గజపతి ప్యాలెస్



దివంగత మహారాజా శ్రీకృష్ణ చంద్రగజపతి నారాయణ్ దేవ్

పర్లాకిమిడి: ఒడిశా స్వతంత్ర రాష్ట్ర ఏర్పాటుకు ఎనలేని కృషిచేసిన పర్లాఖిముండి మహారాజా శ్రీకృష్ణచంద్ర గజపతి నారాయణ దేవ్ జన్మస్థలం అయిన గజపతి ప్యాలెస్‌ను జాతీయ స్మారక చిహ్నంగా ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మరిఝ గుర్తించారు. ఇటీవల రాష్ట్రానికి వచ్చిన మోదీ ఈ నిర్ణయం తీసుకున్నారు. పర్లాకిమిడి మహారాజా ప్యాలెస్, ఇతర స్మారక చిహ్నాలను మరమత్తులు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రకటించారు. దీనిపై పర్లాకిమిడి న్యాయవాదులు, సీనియర్ సిటిజన్లు, పలువురు మేధావులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అధినాయకుడు కోలుకోవాలని ప్రార్థనలు



నబరంగ్‌పూర్ జిల్లాలో ఏకైక శక్తి పీఠం బండారు ఘరణి దేవాలయంలో దీపాలు వెలిగిస్తున్న బీజేడీ నాయకులు



బందుగాం సమితి అలమండ అగ్ని గంగమ్మ దేవాలయంలో పూజలు



నబరంగ్‌పూర్ బండారు ఘరణి శక్తి పీఠం గర్భగుడిలో డాబుగాం ఎమ్మెల్యే మనోహర రంధారి పూజలు

కొరాపుట్: రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, ప్రతి పక్ష బీజేడీ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్ కోలుకోవాలని కోరుతూ కొరాపుట్, నబరంగ్‌పూర్ జిల్లాలో సామూహిక ప్రార్థనలు, పూజలు జరిగాయి. ఆదివారం ముంబైలోని కోకిలా బెన్ ఆస్పత్రిలో జరిగిన శస్త్ర చికిత్స విజయవంతమైందని వ్యక్తిగత వైద్యుడు డాక్టర్ రామాకాంత్ పండా ప్రకటించారు. మరో 5,6 రోజులలో డిశ్చార్జ్ అవుతారని ప్రకటించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



కొబ్బరి మొక్కలను నాటుతున్న క్లబ్ సభ్యులు

రాయగడ: పర్యావరణం సమతుల్యంగా ఉండాలంటే మొక్కలు నాటే బాధ్యత అందరూ తీసుకోవాలని స్థానిక సాయిప్రియ వెల్ఫేర్ ట్రస్టు కార్యదర్శి దయానంద ఖడంగ అన్నారు. స్థానిక సాయిప్రియనగర్‌లోని క్లబ్ ప్రాంగణంలో జామ, కొబ్బరి, నేరేడి తదితర పళ్ల మొక్కలను ఆదివారం నాటారు. ఏటా వర్షాకాలం ప్రారంభంలో వివిధ ప్రాంతాల్లో క్లబ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటుతున్నట్టు ఖడంగ చెప్పారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు టి.ఎన్.రావు, ప్రదీప్ దాస్, శంకరరావు, జి.బ్రాహ్మజీ పాల్గొన్నారు.

శ్రీమందిరంలో రాజప్రసాద్ విజే



పూరీ గజపతి మహా రాజాకు స్వామి స్వస్థత సమాచారం చేరవేసేందుకు బయల్దేరిన సేవాయత్ బృందం

భువనేశ్వర్: పవిత్ర ఒణొసారొ 12వ రోజు పురస్కరించుకుని ఆషాఢ కృష్ణ పక్షం ద్వాదశి తిథి ఆదివారం శ్రీ మందిరంలో రాజప్రసాద్ విజే నిర్వహించారు. దేవతల స్వస్థత సమాచారం పూరీ గజపతి మహారాజాకు గోప్య సేవకులు తెలియజేయడం రాజప్రసాద్ విజే సమగ్ర సారాంశం. ఈ సందర్భంగా మూల విరాట్ల శ్రీఅంగాల నుంచి తొలగించిన పదార్థాలను గజపతి మహా రాజాకు సమర్పించారు.

కరాల కర్మ

స్నాన యాత్ర మర్నాటి నుంచి శ్రీమందిరంలో మూల విరాటులు స్వస్థతతో కోలుకునేందుకు గోప్య సేవలు పొందుతున్నారు. ఈ సందర్భంగా సాధారణ పూజాదులు, నైవేద్యాలు నివారించి ఆయుర్వేద వైద్య విధానాలతో చికిత్స, పత్యం పదార్థాలతో కాలక్షేపం చేస్తున్నారు. ఆషాఢ కృష్ణ ప్రతిపద నుండి చతుర్థి వరకు చికిత్సలో భాగంగా దేవతల శరీర వస్త్రాలను తొలగించి కరాల కర్మను నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో ఆరోగ్యం కోలుకోవడంతో దేవతా మూర్తుల శరీర భాగాలకు పూసిన కస్తూరి, గుగ్గిలం, చువా (సుగంధ ద్రవ్యం) మరియు చందనం, పట్టు పోగులు తొలగిస్తారు. ఇలా వేరు చేసిన పదార్థాలను 'కరాళ' అంటారు.



కరాళ పదార్థాలు



శ్రీ జగన్నాథుని మూల విరాటు నుంచి తొలగించిన చందనం

క్లుప్తంగా

తెగిన హిరాఖండ్ బోగీలు

- ప్రయాణికులు సురక్షితం
- విడిపోయిన బోగీల్లో ఈస్ట్ కోస్ట్ జీఎం



బోగీలు కలిపే చోట వైర్లు తెగిన దృశ్యం



నిలిచిన హిరాఖండ్ బోగీలు

కొరాపుట్: జగదల్‌పూర్–భువనేశ్వర్ మధ్య నడిచే హిరాఖండ్ రైలుకి పెద్ద ప్రమాదం తప్పింది. ఆదివారం సాయంత్రం 6.30 సమయంలో రైలు ఇంజిన్ నుంచి బోగీలు విడిపోయాయి. కొరాపుట్ జిల్లా కొట్‌పాడ్ నుంచి సమీప చత్తీస్‌గఢ్ రాష్ట్రం జగదల్ పూర్‌ల మధ్య అమ్మాగుడ వద్ద ప్రమాదం తప్పింది. ఇంజిన్ నుంచి మిగతా బోగీలు విడిపోయాయి. ఈ ప్రమాదంలో ఎవరికి గాయాలు కాలేదు. మరో వైపు విడిపోయిన ఇంజిన్ వెనుక ఉన్న ప్రధాన వీఐపీ బోగీలో ఈస్ట్ కోస్ట్ జనరల్ మేనేజర్ పరమేశ్వరన్ ఫంకువాల్ ఉన్నట్లు సమాచారం. రైల్వే శాఖలో జీఎం స్థాయి అత్యున్నత వ్యక్తి ఉన్న బోగి ఇలా రైలు ఇంజిన్ నుంచి విడిపోవడం చర్చకు దారి తీసింది. ఈ విషయం తెలుసుకొని జగదల్ పూర్ నుంచి రైల్వే సహాయక బృందాలు సంఘటన స్థలానికి చేరుకుని బోగీలు కలిపారు. అయితే రెండోసారి కూడా బోగీలు విడిపోయాయని ప్రయాణికులు పేర్కొన్నారు. సుమారు 3 గంటల ఆలస్యంగా రాత్రి 8.30 గంటలకు హిరాఖండ్ రైలు జయపూర్ రైల్వేస్టేషన్‌కు చేరుకుంది. ఏం జరిగిందో తెలియక ప్రయాణికులంతా ఆందోళన చెందారు.

రెండు వర్గాల మధ్య గొడవ



గాయాలతో కోత్తమటేర్ గ్రామవాసులు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి సమితి కోత్తమటేర్ గ్రామంలో శనివారం రాత్రి రెండు వర్గాల మధ్య గొడవ జరిగింది. ఏడుగురు గాయాలపాలయ్యారు. వీరికి మల్కన్‌గిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆదివారం కోత్తమటేర్ గ్రామానికి కలెక్టర్ ఆశీష్ ఈశ్వర్ పటేల్, ఎస్పీ వినోద్ పటేల్ వెళ్లి గ్రామస్తులతో మాట్లాడారు.

జయపూర్‌లో భారీ వర్షం



జయపూర్‌లో మురుగు కాలువలు పొంగి రోడ్డుపై పారుతున్న దృశ్యం

కొరాపుట్: జయపూర్, నబరంగ్‌పూర్ పట్టణాల్లో ఆదివారం భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కుంభవృష్టిగా కురిసిన వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. జన జీవనం అస్తవ్యస్తం అయ్యింది. మురుగు కాలువలు పొంగి రోడ్డు మీదకు ప్రవహించాయి. జయపూర్ మెయిన్ రోడ్డుపై వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రం తడిసి ముద్దయింది.

వరద నీటిలో యువకుడు గల్లంతు



సువర్ణ రేఖ వరద దుస్థితి

భువనేశ్వర్: బాలాసోర్ ప్రాంతంలో వరద ఉద్ధతంగా ప్రవహిస్తోంది. ఈ ప్రాంతంలో సువర్ణ రేఖ నది నీటి మట్టం ప్రమాద సంకేతం దాటి కట్టలు తెంచుకుని రహదారులపై పొంగి పొరలుతుంది. ఈ పరిస్థితుల్లో వరద నీటిలో ప్రమాదవశాతు పడిన యువకుడు గల్లంతు అయ్యాడు. బలియాపాల్ ఇకిడిపాల్ ప్రాంతానికి చెందిన వ్యక్తిగా ప్రకటించారు. ఒడ్రాఫ్ బృందం గాలింపు చర్యలు కొనసాగిస్తుంది.

30 నుంచి మెట్రిక్ సప్లిమెంటరీ పరీక్షలు

భువనేశ్వర్: రాష్ట్ర మాధ్యమిక విద్యా బోర్డు (బీఎస్ఈ) ఆధ్వర్యంలో ఒడిశా మెట్రిక్ సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 30 నుంచి ప్రారంభం కానున్నాయి. వచ్చే నెల పదో తేదీ వరకు కొనసాగుతాయి. విద్యార్థులు తమ అడ్మిట్ కార్డులను అధికారిక వెబ్‌సైట్ bsoedirhaac.in నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని బీఎస్ఈ ప్రకటించింది.

ఒకనాడు దాత.. నేడు దయనీయ గాథ



బాధిత కుటుంబ సభ్యులతో వైస్ చైర్మన్ బి.సునీత

- శాపంలా మారిన ఆయుష్మాన్ కార్డు
- చికిత్సకు ఆర్థిక ఇబ్బందులు

కొరాపుట్: నాడు వందలాది కుటుంబాలకు ఇంటి స్థలాలు దానమిచ్చిన కుటుంబానికి ఆయుష్మాన్ కార్డు శాపంలా మారింది. గొప్పగా బతికిన కుటుంబం ఇప్పుడు హృదయ విదాకర స్థితిలోకి వచ్చేసింది. జయపూర్‌కి చెందిన ముగడ సూర్యనారాయణ దానకర్ణుడుగా పేరు గడించారు. తనకున్న ఆస్తుల్లో అత్యధికం పేదలకు పంచి పెట్టారు. ఇల్లు లేని వారికి ఉచితంగా ఇంటి స్థలాలు ఇచ్చారు. పక్కాగా రిజిస్ట్రేషన్ చేసి మరీ వారికి దానం చేశారు. జాతీయ మీడియాలో సైతం ఆయన ఘనతలు ప్రచురితమయ్యాయి.

నేడు అగమ్యగోచరం..

పట్టణంలో ప్రసాదరావు పేట 4వ లైన్ లో నివసిస్తున్న సూర్యనారాయణ కుమారుడు ముగడ రమేష్‌కి ఊపిరితిత్తుల క్యాన్సర్ సోకింది. వైద్యం కోసం ఉన్న ఆస్తులు పోయి చివరకు రమేష్ కుటుంబం అద్దె ఇంటిలోకి మారింది. రోగ తీవ్రత దృష్ట్యా అతడు మందులతోనే జీవించాలి. ప్రతి నెలా రూ.46 వేలు మందులకు ఖర్చవుతాయి. విశాఖపట్నంలోని టాటా మెమోరియల్ ఆస్పత్రి నుంచి మందులు తెచ్చుకొని జీవనం కొనసాగిస్తున్నారు.



దినదిన ప్రాణ గండమని మీడియా ముందు బాధ పడుతున్న రమేష్

ప్రాణం పోసిన బీఎస్‌కేవై కార్డు..

గత ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ప్రవేశ పెట్టిన బిజూ స్వస్థ్య కల్యాణ యోజన (బీఎస్‌కేవై) ఆరోగ్య బీమా కార్డు వీరికి ఎలాంటి ఇబ్బంది లేకుండా చికిత్స అందింది. ఈ కార్డు తో ప్రతి నెల మందులు తెచ్చుకునేవారు. మిగతా సమస్యలు ఎలా ఉన్న మందుల ఖర్చులు లేకపోవడంతో రమేష్ ఆరోగ్య పరిస్థితి కుదుట పడింది.

ఊపిరితీస్తున్న ఆయుష్మాన్ కార్డు

రాష్ట్రంలో బీజేడి ప్రభుత్వం పోయి బీజేపీ ప్రభుత్వం వచ్చింది. వెంటనే ప్రభుత్వం బీఎస్‌కేవై రద్దు చేసి దాని స్థానంలో ఆయుష్మాన్ కార్డు ప్రవేశ పెట్టింది. కొత్త కార్డుతో రమేష్ కుటుంబం మందులకు వెళ్లగా ఆయుష్మాన్ కార్డులో మందులు ఇవ్వడం కుదరదని ఆస్పత్రి వర్గాలు ప్రకటించాయి. దాంతో ప్రతి నెల రు.46 వేలు ఎలా మందులకు తేవాలో తెలియక ఆ కుటుంబం తీవ్ర వేదన లో మునిగిపోయింది.

తరలివెళ్లిన రబినందో..

రమేష్ కుటుంబం దీనావస్థను బీజేడీకి చెందిన మాజీ మంత్రి రబినందో తెలుసుకున్నారు. వెంటనే పార్టీ నాయకులతో కలిసి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. తక్షణ సాయం కింద ఒక నెల మందుల ఖర్చులు రూ.46 వేలు ప్రకటించారు. రబినందో వెంట జయపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ బి.సునీత, ఇతర బీజేడీ నాయకులు ఉన్నారు. అనంతరం రబినందో మాట్లాడుతూ రమేష్ కుటుంబాన్ని ఆదుకుంటామన్నారు.



బాధిత రమేష్ కుటుంబంతో మాట్లాడుతున్న మాజీ మంత్రి రబినందో



ఊపిరి తీస్తున్న ఆయుష్మాన్‌పై మీడియా ముందు ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రబినందో



మందులు లేని ఇబ్బందులు రబినందోకి వివరిస్తున్న రమేష్ సతీమణి శ్రీదేవి

రక్తదానం.. ప్రాణదానం



రక్తదానం చేస్తున్న దాతలు

జయపురం: భారతీయ స్టేట్ బ్యాంక్ జయపురం ప్రధాన శాఖ కార్యాలయంలో ఆదివారం బ్యాంక్ యాజమాన్యం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. జయపురం ఎమ్మెల్యే తారా ప్రసాద్ బాహిణీపతి ముఖ్యఅతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. డాక్టర్ ఎస్.ఎస్.మిశ్ర పర్యవేక్షణలో జయపురం జిల్లా కేంద్ర రక్తనిధి టెక్నీషియన్‌లు అభయ చరణ పండా, గురు పొరజ, బి.ప్రతిభ పాత్రో, నతాయిల్ దేవీ తదితరులు 65 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. 21 ఏళ్ల ఇతిశ్రీ రథ్ మొదటిసారి రక్తదానం చేసి అందరితో ప్రశంసలు అందుకుంది. ఎమ్మెల్యే బాహిణీపతి, స్టేట్ బ్యాంక్ ప్రాంతీయ మేనేజర్ సుభాష్ చంద్ర బెహరా, తదితరులు యువతిని సన్మానించారు. జయపురం సబ్‌డివిజన్ రక్త దాతల మోటివేటెడ్ అసోసియేషన్ కార్యదర్శి ప్రమోద్ కుమార్ రాళో, ఎస్‌బీఐ పట్టణ బ్రాంచ్ మేనేజర్ హిరణ్మయ కుమార్ పాడీ, డాక్టర్ జగదీష్ చంద్ర శెట్టి, తదితరులు పాల్గొన్నారు.



మొదటిసారి రక్తదానం చేస్తున్న ఇతిశ్రీ రథ్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

రోగుల అవస్థలు

- ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేయని ఏసీలు

పర్లాకిమిడి: స్థానిక ప్రభుత్వ హెడ్‌క్వార్టర్ ఆసుపత్రిలో అన్ని వార్డుల్లోనూ వారంరోజుల నుంచి ఏసీలు పనిచేయక పోవడంతో రోగులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. రోజూ 31 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. ఉక్కపోతతో రోగులు అవస్థలు పడుతున్నారు. దీనిపై జిల్లా ముఖ్యవైద్యాధికారి డాక్టర్ ఎం.ఎం.ఆలీకి జిల్లా ట్రాన్స్‌జెండర్స్ సంఘం ప్రతినిధులు, కాంగ్రెస్ మహిళా కార్యదర్శి జాస్మిన్ షేక్ ఆదివారం ఫిర్యాదు చేశారు. వెంటనే ఏసీలు బాగుచేయాలని కోరారు.



జనరల్ వార్డులో పనిచేయని ఏసీలు

అధికారుల పనితీరుపై అసంతృప్తి



సమావేశంలో పాల్గొన్న సర్పంచ్‌లు

జయపురం: జయపురం సబ్‌డివిజన్ కొట్‌పాడ్ సమితిలోని అధికారుల పనితీరుపై ఆ సమితి సర్పంచ్‌ల సంఘం అసంతృప్తి వ్యక్తం చేసింది. కొట్‌పాడ్‌సమితి చతర్ల గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆదివారం సర్పంచ్‌ల సంఘ సమావేశం నిర్వహించింది. సర్పంచ్ త్రినాథ్ మఝి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సమితిలోని పలు సమస్యలపై చర్చించారు. కురమకోట్ నుంచి మహంతిపుట్, కొంగియగుడ నుంచి మఝిగుడ, అవళభట నుంచి కుకిడిపాదర్, దువుర్ల నుంచి సెమల, ఖుర్ష వరకు, ఖడగపూర్ నుంచి భలుగుడ, టిమరగుడ, ఫిటకి కుంభి నుంచి నదీఘాట్, చిత్ర నుంచి పతాన్‌గుడ, ఝునికికజివా రోడ్డు వరకు అన్ని రోడ్లు అధ్వానంగా ఉన్నాయని సమావేశంలో సర్పంచ్‌లు ఆరోపించారు. అధికారులు సమితి వీడి గ్రామీణ ప్రాంతాలకు వెళ్లటం లేదని, జన సునాని కార్యక్రమంలో వారు ఇష్టం వచ్చినప్పుడు వచ్చి సంతకాలు చేసి వెళ్లిపోతున్నారని ఆరోపించారు. మండీలలో ధాన్యం క్రయవిక్రయాల సమయంలో సంబంధిత అధికారులు అంతా ఉండాలని జిల్లా అధికారులు తెలిపినా పట్టించుకోవటం లేదని ఆరోపించారు. ఏఈఈ అనుచితంగా వ్యవహరించగా బాధిత భనసులి పంచాయతీ సర్పంచ్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే దానిని మాఫీ చేశారని ఆరోపించారు. ప్రజాప్రతినిధులను విస్మరించి కంట్రాక్టర్లకు సహకరిస్తున్నారని, అందువలన రెండు పంచాయతీలలో అటువంటి పరిస్థితి ఏర్పడిందన్నారు. అభివృద్ధి పనులను అధికారులు పరిశీలించటం లేదనిన్నారు. సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు దేబొ మఝి, కార్యదర్శి కమల పూజారి, సర్పంచ్‌లు బుదాయి మఝి, కమల చలాన్, బొనిత మఝి, పుష్ప పూజారి, సనమతి గదబ, పూర్ణ పూజారి, మనమతి పూజారి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటం

- రాయగడ ఎమ్మెల్యే అప్పల స్వామి కడ్రక

రాయగడ: ఆదివాసీ, హరిజన ప్రాంతంగా గుర్తింపు పొందిన రాయగడ జిల్లాలో ఇప్పటికీ అనేక సమస్యలు ఉన్నాయని.. వాటిని పరిష్కరించేందుకు తాను సాయశక్తులా పోరాడుతానని స్థానిక ఎమ్మెల్యే ఎమ్మెల్యే అప్పల స్వామి కడ్రక అన్నారు. ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా తన పరిధిలోని వివిధ సమస్యలు, వాటిపరిష్కారం కోసం చేసిన కృషిని వెల్లడించారు. ఈ మేరకు స్థానిక తేజస్విని హోటల్ సమావేశం హాల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని అనేక గ్రామాలకు ఇప్పటికీ సరైన రహదారులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్య, వైద్యం ఆయా గ్రామాలకు అందని ద్రాక్షగానే మిగిలిందన్నారు. ఏడాదిలో నిర్వహించిన అసెంబ్లీ సమావేశాలకు 96 శాతం హాజరై దాదాపు 253 ప్రశ్నలు వేసినట్లు వివరించారు. పెరుగుతున్న దొంగతనాలు, దోపిడీలతో ప్రజలు భాయాందోళనలకు గురవుతున్న నేపథ్యంలో శాంతిభద్రతల మెరుగు పరిచేందుకు ప్రభుత్వం స్థానిక రాణిగుడఫారంలో మహిళా పోలీస్ స్టేషన్‌ను, అదేవిధంగా సాయిప్రియనగర్, రైతుల కాలనీల్లో పోలీస్ అవుట్ పోస్టులను ఏర్పాటు చేయాల్సిందిగా డిమాండ్ చేసినట్లు చెప్పారు. మూడేళ్లలో ఎమ్మెల్యే నిధుల్లో భాగంగా సుమారు మూడూ కోట్ల రూపాయలను గ్రామీణ ప్రాంత రహదారులు, విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల కోసం వెచ్చిస్తానన్నారు.



వార్షిక సంచికను విడుదల చేస్తున్న కడ్రక, ఇతర నాయకులు

దీనావస్థలో క్రీడా సంఘాలు..

జిల్లాలోని క్రీడాకారులకు ఉత్సాహ పరిచేవిధంగా ఏర్పాటు చేస్తున్న క్రీడా సంఘాల పరిస్థితి అత్యంత దయనీయంగా మరిందని ఎమ్మెల్యే అన్నారు. గత 20 ఏళ్లగా క్రికెట్ అసోసియేషన్‌కు ఎన్నికలు జరగలేదని అన్నారు. అధికారులు చొరవ తీసుకోకపోవడంతో క్రీడారంగం రానురాను కుంటుపడే పరిస్థితికి చేరకునే అవకాశం ఉందని.. ఈ విషయమై జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి క్రీడారంగం పునరుద్ధరణ కోసం కృషి చేస్తానని చెప్పారు. ఏడాది పూర్తయిన సందర్భంగా తన నియోజకవర్గం పరిధిలో చేపట్టిన వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించి ప్రొగ్రెస్ రిపోర్టు సంచికను విడుదల చేశారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి దుర్గా ప్రసాద్ పండ, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ శంకర్ జిలకర్ర, డీసీసీ ఉపాధ్యక్షులు శంకర్షన్ మంగరాజ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చిన్నారి కృష్ణమూర్తి, సునీల్ చంద్ర పండ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అప్పల స్వామి కడ్రక

రథాలకు తుదిమెరుగులు



జగన్నాథ రథాలకు రథసారథులు, గుర్రాలను అమర్చుతున్న వడ్రంగులు

పర్లాకిమిడి: గుండిచా రథయాత్ర సమీపిస్తుండటంతో పర్లాకిమిడిలో జగన్నాథ, బలరామ, సుభద్ర రథాల పనులు పూర్తయ్యాయి. రాజవీధి జగన్నాథ రథాల వద్ద అందమైన ముగ్గులను చిత్రకారులు వేస్తున్నారు. రథాలకు బుద్దుడు, గోల్లభామలు, అనేక దేవతామూర్తుల బోమ్మలను అమర్చుతూ తుదిమెరుగులు చేపడుతున్నారు. వచ్చే బుధవారం అమావాస్య రోజు మూడు రథాలపై నీలచక్రాలు అమర్చుతారు. తదనంతరం విధియ రోజు జగన్నాధుడుని చీకటి గది నుంచి బయటకు తెచ్చి నేత్రోత్సవం జరుపుతారు. మరో వైపు రోడ్లు- భవనాల శాఖ ఆధ్వర్యంలో గుండిచా మందిరానికి మరమ్మతులు చేపడుతున్నారు.



జగన్నాథ రథాల ముందు ముగ్గులు, పెయింటింగ్‌లు వేస్తున్న కళాకారులు



పూర్తయిన జగన్నాథస్వామి రథం


జగన్నాథ మందిరంలో మిఠాయిల తయారీ



జగన్నాథ మందిరంలో మిఠాయి తయారు చేస్తున్న దృశ్యం

కొరాపుట్: దక్షిణ ఒడిశా పూరీ దివ్య క్షేత్రంగా పిలవబడుతున్న కొరాపుట్ శబరి శ్రీ క్షేత్రానికికి పూరీ దివ్యాధాం నుంచి పాక శాస్త్ర ప్రవీణులు తరలి వచ్చారు. ఆదివారం పాక శాస్త్రంలో ప్రావీణ్యం ఉన్నవారు మిఠాయి తయారీలో నిమగ్నమయ్యారు. రథా యాత్ర సమయంలో కొరాపుట్ శబరి శ్రీ క్షేత్రంలోని మిఠాయి వంటకాలకు చాలా ప్రాముఖ్యత ఉంది. వీటిని అనేక దేవాలయాలకు ప్రజలు తీసుకొని వెళ్తారు. ఈ నేపథ్యంలో కొరాపుట్ జగన్నాథ ఆలయ కమిటీ పూరీ నుండి ప్రత్యేక మిఠాయి వంటవాళ్లని పిలిపించింది. వారు ఈ యాత్ర సమయంలో స్థానిక కొరాపుట్ జగన్నాథ దేవావయ వంటవాళ్లకి దీనిపై శిక్షణ ఇవ్వనున్నారు. అంతేకాక దేవదేవుళ్లకి ఇష్టమైన వంటలు తయారు చేయనున్నారు. వీరు ఆరు రకాల ఖాజాలు, బాలుసా తయారీలో నిపుణులని కమిటీ పేర్కొంది. ఇప్పటికే శబరి శ్రీ క్షేత్ర జగన్నాథ దేవాలయంలో అధునాతన పరిజ్ఞాన వస్తువులు ఉన్న వంటశాల ఉంది. నిత్యం వందలాది భక్తులు ఇక్కడ మధ్యాహ్నం భోజనాలు చేస్తుంటారు. రథా యాత్ర సమయంలో ఈ సంఖ్య వేలల్లో ఉంటుంది.

సందడే సందడి



మహేంద్రగిరి పర్వతం పైనుంచి కనిపిస్తున్న రోడ్డు

పర్లాకిమిడి: పవిత్ర మహేంద్రగిరి పర్వతంలో భీమ, కుంతి, యుధిస్టర, పరశురామ్ కుండ్‌ను చూడటానికి ఆదివారం ఆంధ్రప్రదేశ్, ఒడిశా నుంచి పర్యాటకులు అధికంగా విచ్చేశారు. పర్లాకిమిడి నుంచి రాయఘడ బ్లాక్ కోయిపూర్ వరకు ఒడిశా బస్సులు వేశారు. మహేంద్రగిరిపై వరకు తారు రోడ్డు వేయడంతో కార్లు, వాహనాలు పర్లాకిమిడి నుంచి గంటన్నరలో ఇక్కడికి చేరుకోవచ్చు. మహేంద్రగిరి పర్వతం వద్ద ఒకరోజు విడిది ఉండటానికి జిల్లా అటవీశాఖ కాటేజ్‌లు ఏర్పాటుచేయడంతో పొరుగు రాష్ట్రాల నుంచి అధికంగా వస్తున్నారు. దీంతో టోల్ గేటు వద్ద ప్రభుత్వానికి మంచి ఆదాయం వస్తుంది. మహేంద్రగిరిలో పబ్లిక్ పార్టిసిపేషన్‌తో హోటళ్లు నిర్మించడానికి అనుమతి ఇవ్వాలని ఇటీవల పర్లాకిమిడి విచ్చేసిన రాష్ట్ర ఎక్సైజ్, ప్రజాపన్నుల శాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్‌కు పలువురు సూచించారు. ఆహ్లాదకరమైన వాతావరణం, చుట్టూ పర్వతాలు, తాగునీరు, షెల్టర్ ఏర్పాటుచేయడంతో శని, ఆదివారాల్లో గంజాం, భువనేశ్వర్, శ్రీకాకుళం, విశాఖపట్నం నుంచి పర్యాటకలు విచ్చేస్తున్నారు.



బుర్ఖాత్ పాస్ వద్ద పార్కింగ్ చేసిన వాహనాలు



రోడ్డు పక్కన పున్న యుధిష్టర మందిరం

క్లుప్తంగా

నేడు పీజీఆర్ఎస్

సీతంపేట: స్థానిక ఐటీడీఏలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) అధికారులు నిర్వహించనున్నారు. ఐటీడీఏ పీవో సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి అధ్యక్షతన జరగనున్న పీజీఆర్ఎస్‌లో గిరిజనులు తమ సమస్యలపై వినతులు సమర్పించవచ్చని అధికారులు తెలిపారు.

రేగులగూడ జీడితోటల్లో ఏనుగులు



జీడి తోటలో ఉన్న ఏనుగులు

సీతంపేట: ఏజెన్సీలో రేగులగూడ సమీపంలో ఉన్న జీడి తోటల్లో ఏనుగులు తిష్టవేశాయి. జీడి మొక్కలను నాశనం చేయడంతో గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. శనివారం కొండ పైకి ఎక్కినట్టే ఎక్కి మళ్లీ ఆదివారం సాయంత్రం కొండ దిగువన ఉన్న జీడితోటలో దర్శనమివ్వడంతో వ్యవసాయ పనులకు వెళ్లిన గిరిజనులు పరుగులు తీశారు. ఏనుగుల ఘీంకారాలతో భయాందోళనలు చెందుతున్నట్టు పలువురు గిరిజన రైతులు తెలిపారు. ఏనుగులు సంచరించే వైపు ప్రజలు వెళ్లొద్దని, కవ్వింపు చర్యలకు పాల్పడవద్దని ఎఫ్‌బీవో కె.దాలినాయుడుతో పాటు ట్రాకర్లు సూచనలిస్తున్నారు.

పూరీ రథయాత్రకు ప్రత్యేక రైళ్లు

విజయనగరం టౌన్: ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని పూరీ జగన్నాథ్ స్వామి రథయాత్రకు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్టు ఈస్ట్‌కోస్ట్ రైల్వే సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపా రు. రైలు నెంబర్ 08313 విశాఖ – పూరీ స్పెష ల్ (26న అర్ధరాత్రి దాటాక) ఈ నెల 27 నుంచి జూలై 5 వరకూ, తిరుగు ప్రయాణంలో రైలు నెంబర్ 08314 పూరీ – విశాఖ స్పెషల్ ఈ నెల 28 నుంచి జూలై 6 వరకూ నడుస్తుంది. జగదల్‌పూర్ – పూరీ – జగదల్ పూర్ స్పెషల్ ట్రైన్ నెంబర్ 08445 ఈ నెల 26 నుంచి జూలై 4వ తేదీ వరకూ, తిరుగు ప్రయాణంలో 0844 6 ఈ నెల 28 నుంచి జూలై 6వరకూ నడుస్తుంది. అదేవిధంగా రాయగడ – కురదారోడ్డు – రాయగడ స్పెషల్ ట్రైన్ నెంబర్ 08593 ఈ నెల 26 నుంచి జూలై 7వరకూ తిరుగు ప్రయాణంలో 08594 కుర్దారోడ్డు – రాయగడ స్పెషల్ ఈ నెల 28 నుంచి జూలై 6 వరకూ నడుస్తాయి. ప్రయాణికులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

హోటళ్లలో ఆకస్మిక తనిఖీలు



హోటళ్లలో తనిఖీలు చేస్తున్న సబ్ కలెక్టర్ జెన్నా, ఏసీఎస్ఓ బొయ్



సాయి ఇంటర్‌నేషనల్ బార్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

రాయగడ: జిల్లా కలెక్టర్ ఫరూల్ పట్వారీ ఆదేశాను సారం సబ్‌కలెక్టర్ రమేష్ కుమార్ జెన్నా నేతృత్వంలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ జ్యోతి ప్రకాష్ సోరేన్, ఏసీఎస్ఓ సుహాన్స్ భొయ్, సానిటరీ ఎక్స్‌ఫర్ట్ బినాయక్ బిక్రం పరిచ్చాల బృందం ఆదివారం పట్టణంలో గల పలు హోటళ్లలో ఆకస్మిక దాడులను నిర్వహించింది. స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో గల రైల్ రెస్టారెంట్‌లో నిర్వహించిన దాడుల్లో నాణ్యత లోపభూయిష్టమైన ఆహారాన్ని వినియోగదారులకు అందిస్తున్నారన్నారు. పారిశుద్ధ్యం పాటించటం లేదని గమనించిన అధికారులు రెస్టారెంట్ యాజమానికి రూ.50 వేల జరిమానా విధించారు. కమర్షియల్ గ్యాస్ సిలిండర్లకు బదులు డొమస్టిక్ గ్యాస్ సిలిండర్లను వినియోగిస్తున్న కారణంగా మూడు వంట గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం హోటల్ కొలాస్‌లో నిర్వహించిన దాడుల్లో 5 డొమస్టిక్ గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. నాణ్యత లేని వంట పదార్థాలు, నిల్వ పదార్థాలు ఉన్నట్లు గుర్తించారు. హోటల్ యజమానికి రూ.50 వేల జరిమానా విధించారు. హోటల్ సాయి ఇంటర్‌నేషన్‌లో గల బార్, రెస్టారెంట్లను తనిఖీ చేశారు. బార్‌కు సంబంధించిన అనుమతి పత్రాలను నిర్వాహకులు చూపించకపోవడంతో రూ.50 వేల జరిమానా విధించారు.

సాగునీటి చెరువునూ చెరపడుతున్నారు...



రాజాం మండలం వీఆర్ అగ్రహారం సమీపంలోని సాగునీటి చెరువునూ అధికార పార్టీ నేతలు చెరపడుతున్నారు. యథేచ్ఛగా చెరువు నుంచి గ్రావెల్‌ను తవ్వుతూ అక్రమ రవాణా చేస్తున్నారు. గుయ్యానవలస గ్రామానికి చెందిన టీడీపీ నేత ఒకరు ఇష్టారాజ్యంగా చెలరేగిపోతున్నారు. చెరువులో పొక్లెయిన్లు పెట్టి పెద్ద పెద్ద గుంతలు తవ్వి గ్రావెల్‌ను తరలించుకుపోతున్నారు. దీని వల్ల సాగు భూములకు, మూగజీవాలకు తీరని నష్టం జరుగుతుందని రైతులు వాపోతున్నారు. తవ్వకాలపై ప్రశ్నిస్తే దౌర్జన్యానికి పాల్పడుతున్నారని వీఆర్ అగ్రహారం గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని ఆవేదన చెందుతున్నారు. రెవెన్యూ అధికారులు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు. – రాజాం

దుస్తుల దుకాణానికి నిప్పు

భువనేశ్వర్: నగరంలో శనివారం రాత్రి పెట్రోల్ దాడి జరిగింది. ఈ సంఘటనలో దుండగులు పెట్రోలు పోసి దుస్తుల దుకాణానికి నిప్పు అంటించారు. ఈ సంఘటనలో ఒక వ్యక్తి గాయపడ్డారు. బైక్ దగ్ధమైంది. స్థానిక ఎయిర్‌పోర్ట్ న్యూ రోడ్ సమీపంలో ఈ ఘటన జరిగింది.

అర్ధ రాత్రి దుండగులు దుస్తుల దుకాణానికి నిప్పు అంటించారు. ఈ దాడి కదలికలు సీసీ టీవీలో రికార్డు అయ్యాయి. దీని ఆధారంగా నిందితుల్ని గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు. స్థానిక ఖండగిరి ఠాణా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ వ్యవహారంలో ఒక నిందితుడిని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు.



దాడిలో దగ్ధమైన బైక్

గంజాయి రవాణా నియంత్రణకు చర్యలు

- ఎస్పీ వకుల్ జిందల్



మాట్లాడుతున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: జిల్లాలో గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగాన్ని నియంత్రించేందుకు బహుముఖం వ్యూహం అమలు చేస్తున్నామని ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. ఆదివారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గంజాయి నియంత్రణకు ప్రత్యేకంగా చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి డైనమిక్ వాహన తనిఖీలు చేపడుతున్నామన్నారు. గంజాయి వ్యాపారాలతో కూడబెట్టిన అక్రమ ఆస్తులను సీజ్ చేస్తున్నామని.. అలాగే వారిపై హిస్టరీ షీట్లు ప్రారంభించి నిఘా పెడుతున్నట్లు చెప్పారు. అలాగే గంజాయి వినియోగం వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరించి, వారిని చైతన్యపరుస్తూ బహుముఖ వ్యూహాలు అమలు చేస్తున్నామన్నారు. ప్రతిరోజూ 10 చోట్ల డైనమిక్ వాహన తనిఖీలు చేపడుతున్నామన్నారు. గత ఏడాదిలో గంజాయి అక్రమ రవాణకు పాల్పడుతున్న వారిని గుర్తించి వారిపై 88 కేసులు నమోదు చేసి.. 2,157 కిలోల గంజాయి, 78 గ్రాముల నల్లమందు, అక్రమ రవాణకు వినియోగించిన 30 వాహనాలను సీజ్ చేయడంతో పాటు 288 మంది నిందితులను అరెస్టు చేశామని తెలిపారు. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 52 కేసులు నమోదు చేసి 346 కిలోల గంజాయి, అక్రమ రవాణకు వినియోగించిన 21 వాహనాలను సీజ్ చేయడంతో పాటు 155 మంది నిందితులను అరెస్ట్ చేసి, రిమాండుకు తరలించామని చెప్పారు.

కబడ్డీ క్రీడాకారులకు ప్రోత్సాహం..

పాలకొండ: కబడ్డీ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు కె. ప్రభావతి అన్నారు. పాలకొండలో అండర్ –18 కబడ్డీ జట్టు క్రీడాకారుల ఎంపిక ఆదివారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కబడ్డీలో మన రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించే వారి సంఖ్య తక్కువగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిభ కలిగిన వారు మన రాష్ట్రంలోనే ఎక్కువగా ఉన్నారని తెలిపారు. వీరిని ప్రోత్సహించేందుకు అసోసియేషన్ కృషి చేస్తుందని తెలిపారు.

14 మంది క్రీడాకారులు ఎంపిక

ఈ నెల 27 నుంచి హరిద్వార్‌లో జరగనున్న అండర్ 18 కబడ్డీ జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే క్రీడాకారులను ఎంపిక చేశారు. 10 రోజులుగా పట్టణంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు పల్లా కొండలరావు సహకారంతో క్రీడాకారులకు శిక్షణ అందించారు. రాష్ట్రంలోని పలు జిల్లాలకు చెందిన 20 మంది క్రీడాకారులు శిక్షణ పొందారు. వీరిలో 14 మందిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఇందుకోసం ప్రభావతితో పాటు అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి వై. శ్రీకాంత్, వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ ఎన్. అప్పారావు క్రీడాకారులకు పోటీలు నిర్వహించి జట్టును ప్రకటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో అసోసియేషన్ నాయకులు సబ్బురాజు, నాంచారయ్య, రాంబాబు, సుధాకర్ మాట్లాడుతూ.. కబడ్డీ క్రీడాకారులకు పలు సూచనలు అందించారు. పది రోజుల పాటు ఉచిత భోజనం, వసతి కల్పించిన పల్లా కొండలరావుకు అసోసియేషన్ సభ్యులు, క్రీడాకారులు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం జిల్లా అసోయేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర అసోషియేషన్ నాయకులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సీఎల్ నాయుడు, వి. చంద్రశేఖర్, గార లక్ష్మణ్, కె. రమేష్, పలువురు మాజీ క్రీడాకారులు పాల్గొన్నారు.

చింత చెట్టుకు నిప్పు..

వీరఘట్టం మండలంలోని తూడి గ్రామంలో నివాస గృహాల మధ్య ఉన్న ఓ చింత చెట్టుకు ఆదివారం నిప్పంటుకుని పెద్ద మంటలు చెలరేగాయి. విషయం తెలుసుకున్న పాలకొండ ఫైర్ ఆఫీసర్ జామి సర్వేశ్వరరావు తమ సిబ్బందితో వచ్చి మంటలను అదుపు చేశారు. చెట్టు సమీపంలో ఉన్న చెత్తను కొంతమంది తగులబెడుతుండగా.. చెట్టుకు నిప్పు అంటుకుందని గ్రామస్తులు తెలిపారు.

వీరఘట్టం



సెల్‌ఫోన్ల దొంగ అరెస్ట్

విజయనగరం క్రైమ్: జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ ఒకటో నంబర్ ప్లాట్‌ఫారంపై అనుమానాస్పదంగా తిరుగుతున్న ఒకరిని జీఆర్‌పీ సిబ్బంది ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా జీఆర్‌పీ ఎస్సై బాలాజీరావు మాట్లాడుతూ.. వైజాగ్ జీఆర్‌పీ డీఎస్పీ రామచంద్రరావు ఆదేశాలతో సీఐ రవికుమార్ ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేపడుతుండగా అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామన్నారు. ఇతడ్ని విచారించగా.. రెండు సెల్‌ఫోన్లు అపహరించినట్లుగా తేలిందన్నారు. నిందితుడ్ని బొబ్బిలి మండలం చల్లవలసకు చెందిన ప్రసాద్‌గా గుర్తించామన్నారు. ఇతనిపై కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం విశాఖ రైల్వేకోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు.



జీఆర్‌పీ సిబ్బంది అదుపులో సెల్‌ఫోన్ దొంగ

గిరిజన మహిళ
కన్నీటి వేదన!

- భర్త లేరు.. పింఛన్ రాదు.. రేషన్ ఇవ్వరు..
- ఇద్దరు చిన్నారులతో అష్టకష్టాలు



ఇద్దరు చిన్నారులతో కొండగొర్రి సంధ్య

పార్వతీపురం రూరల్:

ఆమె ఓ గిరిజన మహిళ.. 19 ఏళ్లకే వివాహం జరిగింది. ఏడాది కిందట భర్త విష జ్వరంతో బాధపడుతూ మృతి చెందాడు. భర్త మృతి చెందే నాటికి సంధ్య మొదటి బిడ్డకు ఏడాది వయసు. అప్పటికే మళ్లీ గర్భిణి కావడంతో తరువాత ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. ప్రస్తుతం ఆడ బిడ్డకు నెలల వయసు. అప్పటి నుంచి ఆధారం లేక బిడ్డలతో అవస్థలు పడుతూనే ఉంది. ఆమె కష్టాలు చూసి ఇటు పాలకులకుగాని, అటు అధికారులకుగాని మనసు కరగ లేదు. పింఛన్ మంజూరు కాలేదు. రేషన్ ఇవ్వడం లేదు... ఇది ఓ గిరిజన మహిళ కన్నీటి వేదన. వివరాల్లోకి వెళ్తే..

పార్వతీపురం మండలం గంగాపురం పంచాయతీ కొత్తపాకలు గ్రామంలో ఉంటున్న కొండగొర్రి సంధ్య భర్త రమేష్‌తో పాటు ఒక బిడ్డతో ఉన్నంతలో కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించేది. భర్త రమేష్ ఏడాది కిందట విష జ్వరంతో మృతి చెందాడు. అప్పటికే ఒక చిన్నారితో పాటు నెలల గర్భవతిగా ఉన్న సంధ్య ఒంటరిగా తన జీవితాన్ని అతి కష్టంతో నెట్టుకొస్తోంది. అంతలోనే ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అయితే భర్త మరణాంతరం తనకు వితంతు పింఛన్‌తో పాటు రేషన్ కార్డు మంజూరు చేయాలని సంబంధిత పంచాయతీ అధికారుల వద్ద మొర పెట్టుకుంది. అధికారుల చుట్టూ తన ఓపిక ఉన్నంత మేరకు తిరిగింది. అయినా వారి మనసు చలించలేదు. ఫలితం లేకపోయింది. ఈ క్రమంలో తన ఆవేదనను ప్రజా సంఘాల నాయకుల వద్ద చెప్పుకుంది. సంధ్య బాధను విన్న సీపీఎం నాయకులు కలెక్టర్ దృష్టిలో సోమవారం పెడతామని పింఛన్, రేషన్ కార్డు మంజూరుకు తమ వంతు కృషి చేస్తామని భరోసా ఇచ్చారు.

జూలై 26, 27 తేదీల్లో సీపీఐ జిల్లా మహాసభలు

బొబ్బిలి రూరల్: సీపీఐ 14వ జిల్లా మహాసభ లు జూలై 26, 27 తేదీల్లో బొబ్బిలి పట్టణంలో నిర్వహించనున్నట్టు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ వెల్లడించారు. మండలంలోని సీహెచ్ బొడ్డవలస గ్రామంలో సీపీఐ మండల సభను ఆదివారం నిర్వహించారు. మండల కార్యదర్శిగా కాగాన గణేష్‌ను ఎంపిక చేశారు. అనంతరం జిల్లా మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాలక పక్షాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమాలు నిర్వహిస్తూ రైతు, పేద, బడుగు వర్గాల్లో వెలుగులు నింపేందుకు సీపీఐ నిరంతరం కృషి చేస్తుందన్నారు. నిరుపేద, గిరిజనులకు భూ హక్కుల ను కల్పించడమే తమ పోరాటాల లక్ష్యమన్నా రు. జిల్లా మహాసభల్లో భవిష్యత్ కార్యాచరణ ను ప్రకటిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా సభ్యులు కోట అప్పన్న, కార్యదర్శి కాగాన గణేష్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.



మహాసభల కరపత్రాలను విడుదల చేస్తున్న సీపీఐ నాయకులు

ప్రాణదాతల
ఆకలి కేకలు!



వర్షంలో సేవలు అందించేందుకు వెళ్తున్న పాలకొండ 108 వాహనం

ఆ వాహనాల్లో పని చేసే సిబ్బంది ఒక్క మాటలో చెప్పాలంటే ప్రాణదాతలే... ఎందుకంటే అత్యవసర సమయాల్లో కుయ్.. కుయ్... అంటూ పరుగులు పెడుతూ ప్రాణాపాయంలో ఉన్న వారికి వైద్య సేవలు అత్యవసరంగా అందించి తరువాత అవసరమైన ఆసుపత్రులకు తరలిస్తారు. ఇంతటి ప్రాధాన్యత గల ఆ వాహనాల్లో పని చేసే సిబ్బంది మూడు నెలలుగా వేతనాలు చెల్లించని పరిస్థితి కూటమి పాలనలో నెలకొంది. గత ఎన్నికల సమయంలో వేతనం రూ.4వేలు పెంచుతామని హామీనిచ్చిన కూటమి నేతలు పెంపు మాట దేవుడెరుగు... మా వేతనాలు మాకు సకాలంలో చెల్లించాలని వేడుకొంటున్నారు. వారే 108 వాహన సిబ్బంది. వివరాల్లోకి వెళ్తే...

- 108 సిబ్బందికి మూడు నెలలుగా అందని వేతనాలు
- 15 మండలాల్లో 17 వాహనాలతో అత్యవసర సేవలు
- విధుల్లో 90 మంది ఈఎంటీలు, పైలెట్లు
- అరబిందో నుంచి భవ్య సంస్థకు 108 సేవల బదలాయింపు
- రూ.4వేల వేతనం పెంపునకు కూటమి ప్రభుత్వం హామీ
- ఏడాది గడిచినా చర్యలు శూన్యం



ఏజెన్సీలో కీలక సేవల్లో నిమగ్నమైన 108 సిబ్బంది

పాలకొండ రూరల్:

అత్యవసర సమయంలో ప్రాణాలు నిలిపే 108 వాహనాల సిబ్బందికి మూడు నెలలుగా వేతన చెల్లింపుల్లేక ఆకలి కేకలు పెడుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అరబిందో సంస్థ పర్యవేక్షణలో విధులు చేపట్టిన వీరు కూటమి అధికారంలోకి వచ్చాక పర్యవేక్షణ బాధ్యతలను భవ్య సంస్థకు బదలాయించింది. ఈ క్రమంలో గత ఎన్నికల వేళ 108 సిబ్బంది వేతనాల పెంపు విషయమై కూటమి నేతలు హామీ ఇచ్చారు. బకాయిల చెల్లింపుతో పాటు రూ.4వేల వేతనం పెంచుతామని నమ్మబలికారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైనా జీతం పెరుగుదల లేక సకాలంలో జీతాలు చెల్లించని పరిస్థితి నెలకొంది. దీంతో సిబ్బంది ఆకలి కేకలు పెడుతున్నారు. తమ బకాయిల చెల్లింపులెప్పుడని సిబ్బంది ప్రశ్నిస్తున్నారు.

అప్పు చేస్తేనే..

108 అంబులెన్సులు 15, నియోనాటల్ (నవజాతి శిశువుల కోసం కేటాయించిన) వాహనాలు రెండు. జిల్లాలో 15 మండలాల్లో 108 వాహనాలు 17 మైదాన, గిరిజన ప్రాంతాల్లో సేవలు కొనసాగిస్తున్నాయి. వీటిలో 108 అంబులెన్సులు 15 కాగా, నియోనిటల్ (నవజాతి శిశువుల కోసం కేటాయించినవి) వాహనాలు రెండు ఉన్నాయి. ప్రతి వాహనానికి నలుగురు చొప్పున సిబ్బంది, మరో రెండు వాహనాల్లో ఇద్దరు చొప్పున 90 మంది వరకు సిబ్బంది పని చేస్తున్నారు. వీరిలో పైలెట్ (వాహన డ్రైవర్లు)కు నెలకు రూ.28 వేల వరకు, ఈఎంటీకి రూ.30 వేలు, కొత్తగా ఉద్యోగంలో చేరిన వారికి రూ.20 వేల వరకు జీతాలు చెల్లించాల్సి ఉంది. అయితే నెలల కొద్ది 108 సిబ్బంది జీతాలు చెల్లించటం లేదు. మూడు నెలలు కావస్తున్నా వేతన చెల్లింపుల్లేవని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీతం కోసం ఆందోళన చేసినప్పుడు ఎంతో కొంత చెల్లించి చేతులు దులుపేసుకోవడం పరిపాటిగా మారిందని సిబ్బంది వాపోతున్నారు. జీతాలపై ఆధారపడి కుటుంబాలను నెట్టుకొచ్చే తామంతా కుటుంబ పోషణ, నిర్వహణకు అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గడిచిన నాలుగేళ్లగా తమ లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్లు దాదాపుగా 60 రోజులతో పాటు గ్రాట్యూటీ, ప్రస్తుత వేతన బకాయిలు మొత్తంగా ఒక్కొక్కరికి రూ.లక్షా 50వేల నుంచి 2 లక్షల మేర బకాయిలు ఉన్నట్టు సిబ్బంది పేర్కొంటున్నారు. ప్రస్తుత నెలలో పిల్లల బడులు, పుస్తకాలు, జీతాలు ఇలా అనేక ఖర్చులు వేధిస్తున్నాయంటున్నారు.

పెరుగుతున్న పనిభారం..

ప్రస్తుతం 108 సిబ్బందిపై పనిభారం అధికంగా ఉంటోంది. వర్షాకాలం కావటంతో రోడ్డు ప్రమాదాలు పెరగడం, అత్యవసర కేసులు, పీహెచ్‌సీలు, ఏరియా ఆసుపత్రి నుంచి రిఫరల్ కేసులు అధికంగా ఉండటం వల్ల సిబ్బందిపై ఒత్తిడి పెరుగుతోంది. రోడ్డు ప్రమాదాల సమయంలో సకాలంలో సంఘటనా స్థలానికి చేరుకుని, క్షతగాత్రులను వీలైనంత త్వరగా ఆసుపత్రులకు చేర్చాల్సి ఉంటుంది. అత్యవసర కేసులకు మెరుగైన చికిత్స, హైరిస్క్ పేషంట్లను ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తీసుకువెళ్లాలి. విధి నిర్వహణలో భాగంగా పగలు, రాత్రి తేడా లేకుండా 108 వాహనాలు తిరుగుతూనే ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఇలా కీలక సేవలు అందిస్తున్న తమకు జీతాలు సక్రమంగా ఇవ్వకపోతే ఎలా పని చేయాలంటూ వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా భవ్య సంస్థ తమ ఇబ్బందులు కూటమి ప్రభుత్వానికి వివరించి బకాయిల చెల్లింపుతో పాటు జీతాల పెంపు హామీ అమలుకు కృషి చేయాలని కోరుతున్నారు.

ప్రభుత్వం నుంచి బిల్లుల రాక..

రాష్ట్రంలో ప్రభుత్వం మారిన వెంటనే కూటమి ప్రభుత్వం 108 వాహనాల నిర్వహణను అరబిందో సంస్థ నుంచి భవ్య సంస్థకు అప్పజెప్పింది. వాహనాల నిర్వహణతో పాటు సిబ్బంది జీతాలు కూడా ఆ సంస్థ చెల్లించాల్సి ఉంటుంది. దీనికి గాను ఆ సంస్థకు ప్రభుత్వం పాత వాహనమైతే నెలకు సరాసరిన రూ 2.20 లక్షలు, కొత్త వాహనమైతే దాదాపుగా రూ.1.90 లక్షలు పైబడి చెల్లించాల్సి ఉంటుందని సిబ్బంది చెబుతున్నారు. వీటితోనే వాహనాల నిర్వహణ, సిబ్బంది జీతాలు చెల్లించాలి. ప్రభుత్వం నుంచి బిల్లులు సక్రమంగా రాకపోవటంతో వేతన చెల్లింపులు జరగటం లేదు. ఇదే స్థితి కొనసాగితే వాహనాల నిర్వహణకు ఇబ్బందులు ఎదురవుతాయని సమాచారం.